క్లుప్తంగా

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

ఆర్మూర్‌టౌన్: నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ప్రజలెవరూ దళారులను సంప్రదించవద్దని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఇప్పటివరకు 4,180 కొత్త రేషన్ కార్డు దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించామని ఇంకా 1055 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

బకాయిలను విడుదల చేయాలి



ఆర్మూర్‌టౌన్: మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ బకాయిలను విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధల నాగరాజు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు అభిషేక్, జోహార్ సింగ్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పోషకాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. క్షయ వ్యాధికి గురైన వారు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్ ఫాతిమా, సీహెచ్‌వో కృష్ణమూర్తి, హెచ్‌వో సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలి



వేల్పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన బూత్‌లెవల్ అధికారుల శిక్షణను పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పకుండా పాటించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బూత్‌స్థాయి అధికారులు కీలకంగా ఉంటారన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో బాలకిషన్, శిక్షణ అధికారులు దేవానందం, గంట అశోక్ ఉన్నారు.

కళాశాలలో హాజరు శాతాన్ని పెంచాలి



వర్ని: జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అధ్యాపకులకు సూచించారు. గురువారం వర్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుతో పాటు అడ్మిషన్లను కూడా పెంచాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



రుద్రూర్: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్, దాత్రి శ్రీ ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రుద్రూర్ మండలంలోని రాణంపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేవీ మోహన్, దాత్రిక ఫౌండేషన్ చైర్మన్ గాండ్ల మధు, సభ్యులు శ్రీకాంత్ గౌడ్, సాయి కిరణ్, లయన్స్ సభ్యులు పుట్టి సాగర్, శామీర్ తదితరులు పాల్గొన్నారు.

వర్నిలో..

వర్ని: మండల కేంద్రంలో గురువారం లయన్స్ క్లబ్, మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ట్రస్టు మేనేజర్ ఠాగూర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నగేశ్, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

- బాల్కొండ వనమహోత్సవంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి



నందిపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, సిబ్బంది



ఏర్గట్లలో మొక్కలు నాటుతున్న అధికారులు



బాల్కొండలో మొక్క నాటుతున్న రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి

బాల్కొండ: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని రాష్ట్ర కో–ఆపరేటివ్‌యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. వాతావరణ సమతుల్యత కాపాడేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వన మహోత్సవంలో కాంగ్రెస్ శ్రేణులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రసూల్ బీ, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏపీవో ఇందిరా, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, బాల్కొండ, ముప్కాల్ మండలాల కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, మగ్గిడి ముత్యంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్‌లో..

నందిపేట్: వనమహోత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటాలని నందిపేట ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీప్రసాద్, ఈజీఎస్ ఏపీవో సవిత, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రాజ్‌కుమార్, జీపీ కార్యదర్శి మహేందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మన్‌శాస్త్రి, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో..

మోర్తాడ్: వన మహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని ఏర్గట్ల మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. మండల కేందంరలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, శ్రీనివాస్, విద్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్: భావితరాల భవిష్యత్తు, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ విఠల్, ఏఎంసీ వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి,కార్యదర్శి భారతి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, పాషా మోహినొద్దీన్, నాయకులు సంజీవ్ రెడ్డి, అల్లె రమేశ్, డైరెక్టర్లు అంజయ్య, సలీం, రవిదాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.



బోధన్‌లో మొక్క నాటుతున్న ఏఎంసీ చైర్మన్

బోధన్ బల్దియా ఆదాయం పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్: బోధన్ బల్దియా ఆదాయం పెంచేందుకు అధికారులతో పాటు వార్డు ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మనహోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మొక్కలు నాటారు. ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కష్టపడాలని సూచించారు. అనంతరం బల్దియా కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బల్దియా ఆదాయం నెలకు రూ. 27 లక్షలు ఉండగా ఖర్చు రూ. 50 లక్షలు ఉందన్నారు. వార్డు ఆఫీసర్లు ఆస్తి పన్ను, తాగునీటి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు వార్డుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారని, బల్దియా ఆదాయం పెంచేందుకు ప్రజలు సహకరించి నెలకు రూ. వంద సర్వీస్ చార్జీ చెల్లించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను, సిబ్బందిని ఇంటికి పంపించేందుకు వెనుకాడబోమని, అందరూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మున్సిపల్ దుకాణాలు ఒకరి పేరుతో ఉంటే మరొకరు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వాటిని ఎలాంటి నోటీసులు లేకుండా ఖాళీ చేయించాలని కమిషనర్ జాదవ్ కృష్ణను ఆదేశించారు. అనంతరం బోధన్, సాలూర మండలాల కుల గణన ఎంట్రీ చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలని కోరుతూ వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో డీఈ యోగేశ్, ఉర్దూ అకడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లం, నాయకులు శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 85 వేలతో కుర్చీల మరమ్మతులు



నవీపేట: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సొంతంగా పోగు చేసిన రూ. 85 వేలతో పాడైన కుర్చీలు, బెంచీలకు మరమ్మతులు చేపట్టారు. గురువారం పాఠశాల గదుల్లో వాటిని వినియోగంలోకి తెచ్చారు. విద్యార్థులు కుర్చుండే కొన్ని కుర్చీలు, బెంచీలు పాక్షికంగా ధ్వంసమవడంతో స్టోర్ రూమ్‌లో ఉంచారు. ఈ సంఖ్య రోజురోజుకు పెరగడంతో విద్యార్థులకు కుర్చుండేందుకు ఇబ్బంది నెలకొంది. దీంతో ఈ వేసవి సెలవుల్లో వాటిని బయటకు తీసిన ఉపాధ్యాయులు సొంత డబ్బులతో మరమ్మతులు చేయించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు.

విద్యార్థిని చదువు కోసం ఆర్థికసాయం



బాల్కొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తన పూర్వ విద్యార్థి మైత్రిని దత్తత తీసుకొని చదువు కోసం ఆర్థికసాయం అందజేశారు. ఆమె రెండేళ్లు చదివే నర్సింగ్ కోర్సుకు అయ్యే ఖర్చును శ్రీనివాస్ దంపతులు భరించేందుకు ముందుకు వచ్చారు. గతంలో కూడ అనేక మంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివించారని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. శ్రీనివాస్ దంపతులను ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలు ఇబ్బందులు పడే పనులు చేపట్టొద్దు

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మాక్లూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఇతర అభివృద్ధి పనుల విషయమై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే వెంటనే వాటిని ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండలంలో 71 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు మదన్‌పల్లిలోని ఒడ్డెరకాలనీలో తాగునీటి బోరుబావి తవ్వకానికి భూమిపూజ చేశారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో, సమీపంలో ఉన్న అనాథ ఆశ్రమంలోని వృద్ధులతో మాట్లాడారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో టి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఆర్ఐ మహ్మద్ షఫీ, మండల వ్యవసాయాధికారి పద్మ, పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే, పంచాయితీరాజ్‌ఏఈ సాయి సూర్య, పార్టీ మండల అధ్యక్షురాలు మదారి మమతరాజేశ్వర్, నాయకులు గంగోనే సంతోష్, గోవూరు ఒడ్డెన్న, అనిల్‌కులకర్ణి, చిన్నాపూర్ వినోద్, చింత ప్రవీణ్‌రెడ్డి, ముప్పా గంగారెడ్డి, డి రమేశ్, శివలాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల రీసర్వే చేయాలి

కమ్మర్‌పల్లి: ఇందిరమ్మ పథకం కింద కొత్తగా మంజూరైన ఇళ్లను ఇందిరా ఆవాస్ యోజన యాప్‌లో సర్వే చేయాలని జీపీ కార్యదర్శులను ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఆదేశించారు. గురువారం కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏ, ఎఫ్‌ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం కోసం ఫిట్టింగ్, ప్లాంటింగ్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

నందిపేట్: మండలంలోని బాద్గుణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సారెడ్డి, సుదన్, ముత్తెన్న, ముత్యం రెడ్డి, సాయిలు, వాహెద్, అలీ, జీవన్, మన్నె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



వంతెన నిర్మించండి..

డొంకేశ్వర్: మండలంలోని కోమట్‌పల్లి నుంచి నికాల్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో అలుగు ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలం వస్తే అలుగుపారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లోతుగా ఉన్న ఈ మార్గం నుంచి వాహనాలు నడపడం కష్టంగా మారుతోంది. అదుపు తప్పి చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించి సమస్యకు పరిష్కరించాలి. – పద్మారావు, కోమట్‌పల్లి

మాకు ఫొటో పంపండి – మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ట్రిపుల్‌ఐటీలో సీట్లు మండలానికే గర్వకారణం



ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బషీరాబాద్‌లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

డొంకేశ్వర్: పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 27 మంది విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు రావడం డొంకేశ్వర్ మండలానికే గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశెరం భూమేశ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. నాయకులు గుండు హరీశ్, బానోత్ సుమన్, అశోక్, హరిదాస్, వైఎస్ గంగాధర్, నాగరాజు, గోపి తదితరులు ఉన్నారు.

బషీరాబాద్‌లో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్, చౌట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. ఎంఈవో ఆంధ్రయ్య, హెచ్‌ఎం కనక గంగాధర్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నోముల నరేందర్ రెడ్డి, సున్నం మోహన్, రేవతి గంగాధర్, తెడ్డు రమేశ్, బద్రి, గోపిడి లింగారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రాజీనామా చేయాలి



మున్సిపల్ కమిషనర్ కుర్చీకి శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా మారుతున్న ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పనిచేస్తున్నందుకు గాను సన్మానించేందుకు వెళ్లగా ఆయన లేకపోవడంతో ఆయన కుర్చీని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి నిరసన తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. కమిషనర్‌పై అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు తిరుపతి నాయక్, ఖాందేష్ ప్రశాంత్, దొండి ప్రకాశ్, పాన్‌శీను, చిన్నారెడ్డి, సాయి, పులి యుగేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం



పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలలో వ్యాసుని చిత్రపటానికి పూలమాలలు వేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



పడగల్ బీసీ హాస్టల్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వేద వ్యాసుని జన్మదినాన్ని పురస్కరించుకుని గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో గురు పౌర్ణమి వేడుకలు చేపట్టారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, ఆలయాల్లో, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో గురువులను ఘనంగా సన్మానించారు. ఆలయాల్లో పూజలు చేశారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌లో నందీశ్వర మహరాజ్‌ను పూజిస్తున్న భక్తులు



ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



భీమ్‌గల్‌లో..

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర అభియాన్ ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. శిబిరంలో కిషన్, సురేశ్, అలేఖ్య, రఘు, రవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాల కార్మికుని గుర్తింపు

నవీపేట: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జోత్స్నా దేవి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. జమీర్ హోటల్ లో బాల కార్మికుడిగా పనిచేస్తున్న 12 ఏళ్ల దాసరి మహేశ్‌ను గుర్తించారు. హోటల్ యజమాని జమీర్ పై చర్యలు తీసుకోవాలని ఎస్సై వినయ్ కు ఫిర్యాదు చేశారు. ప్రాజెక్ట్ అధికారులు అపర్ణ, సాధన, నిరీక్షణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

డొంకేశ్వర్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్ ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వ నమోదు చేయించారు. మండల అధ్యక్షుడు రాజేశ్వర్, గంగారెడ్డి, సంతోష్, నవనీత, సరిత, వరలక్ష్మి ఉన్నారు.

కార్యదర్శులు వేధింపులు మానుకోవాలి

రుద్రూర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేసిన జీపీ కార్మికులపై కొందరు కార్యదర్శులు వేధింపులు చేస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు నన్నేసాబ్ అన్నారు. జీపీ కార్మికులపై వేధింపులు చేయకుండా చూడాలని గురువారం కోటగిరి మండల కేంద్రంలో ఎంపీడీవో, ఎంపీవోకు జీపీ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజేశ్వరి, లింగం, జాకీర్ హుస్సేన్, అర్జున్, రజిని, హన్మాండ్లు, సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నందిపేట్: మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో గురువారం జిల్లా స్థాయి శ్రీమద్భగవద్గీత 18వ అధ్యాయపు మోక్ష సన్యాస యోగంపై శ్లోకాల పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ ఆవిష్కరించారు. ఈ నెల 16 లోపు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బాలాజీ సత్సంగ్ వ్యవస్థాపకులు కృష్ణకుమార్ గుప్తా అన్నారు. కార్యక్రమంలో సంజీవ్, రామలింగం, జనార్దన్‌రెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దోమల బెడదను నియంత్రించండి

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ డిమాండ్ చేశారు. పట్టణంలో దోమల, కుక్కల బెడదను నియంత్రించాలని గురువారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతి పత్రం అందించారు. నాయకులు ధర్మపురి, మాసిని వినోద్, గుంత గంగాధర్, భూమయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కమ్మర్‌పల్లి: మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మెట్టు సాయన్న ఇటీవల మరణించడంతో బాధిత కుటుంబాన్ని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు ఉన్నారు.